ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 20.0

ఆ ఐదు చోట్ల మార్పులు లేనట్టేనా !



» నేడో రేపో వైసీపీ అధికారిక జాబితా విడుదల

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):
అధికార వైసీపీ ఈసారి సిట్టింగులలో కొందరిని తొలగించి, ఇంకొందరి స్థానాలు మార్చి ఎన్నికల బరిలోకి దిగుతోంది. తొలుత రిజర్వుడు నియోజకవర్గమైన పోలవరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బాలరాజును తప్పించి ఆయన సతీమణి రాజ్యలక్ష్మిని సమన్వయకర్తగా నియమించింది. చింతలపూడి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాను పక్కన పెట్టేశారు. అయినా తుది ప్రయత్నాలంటూ మంగళవారం ఆయన పెద్దలను కలిసి తన విన్నపాన్ని అంగీకరించేలా చేయడానికి విశ్వ ప్రయత్నం చేశారు. ఇక్కడి నుంచి రవాణా శాఖ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విజయరాజుకు వైసీపీ నాయకత్వం పక్షం రోజులకు ముందే అనుకూల సంకేతాలు ఇచ్చింది. ఆయన విధాన పరిషత్ చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు విజయరాజు స్వయాన వియ్యంకుడు. వీరిద్దరూ దాదాపు పోటీకి సిద్ధమైనట్టే. ఉంగుటూరు నుంచి పుప్పాల వాసుబాబు తిరిగి పోటీకి రెడీ చేస్తున్నారు. అధికారికంగా ఆయన పేరు త్వరలోనే ప్రకటిస్తారు. కైకలూరు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, దెందులూరు నుంచి అబ్బయ్యచౌదరి, నూజివీడు నుంచి మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నూజివీడులో మారుతున్న పరిణామాల దృష్ట్యా టీడీపీ తీసుకున్న నిర్ణయాన్ని బట్టే తదుపరి ఎత్తుగడలు ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే పార్థసారథి టీడీపీలో చేరి నూజివీడు నుంచి పోటీ చేస్తారని ప్రచారం సాగుతోంది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే ప్రతాప్ అప్పారావు బరిలో ఉంటారా, లేక మార్పు లు, చేర్పులు ఏమైనా ఉంటాయా అనేది తేలిపోనుంది.

ఏలూరులో ముగ్గురికి కొవిడ్

ఏలూరు ఎడ్యుకేషన్ : నగరంలో ముగ్గురికి కొవిడ్ పాజిటివ్ మంగళవారం నిర్ధారణైంది. వీరిలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. అందరూ 40 ఏళ్ల వయసుగల వారేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వీరంతా హోంఐసొలేషన్‌లో ఉన్నార ని, ఆరోగ్యం స్థిరంగా ఉందని వివరించాయి. వీరినుంచి సేకరించిన శ్వాబ్ నమూనాలను వేరి యంట్‌ను గుర్తించేం దుకు విజయవాడలోని స్టేట్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు.

తీరని ఓటు సమస్య

ఎన్నికల సమయం ముంచుకొస్తోంది. ఓటరు సమస్య తీరనంటోంది. డబుల్ ఎంట్రీ నుంచి డూప్లికేట్ ఓటర్ల నమోదు వరకు సమస్యల చిట్టా నేటికీ అలాగే ఉంది. రికార్డుల్లో సమస్యలు పరిష్కారమయ్యాయని నమోదు చేస్తోన్న అధికారుల పనితీరు వాస్తవ రూపంలో విమర్శలకు తావిస్తున్నాయి. ప్రతిపక్షం మూడు నెలల క్రితం లేవనెత్తిన అనుమానాలపై నేటికీ సమాధానమివ్వని ఎన్నికల అధికారులు, ఉన్నతాధికారులకు పూర్తిస్థాయి పరిష్కారాలు అంటూ నివేదికలు అందిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో జరిగిన మూడో సమావేశంలోనూ అదే పునరావృతమైంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)





విజయవాడలో ఎన్నికల సంఘం సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాశ్, కలెక్టర్ ప్రశాంతి

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలపై స్పష్టత కరువు

» ప్రతిపక్షం ప్రశ్నలకు సమాధానాలు లేవు
» 57,669 ఓటర్ల సమస్యలకు నివృత్తి ఏది ?
» ఫారం-6, 7, 8లలో రాని మార్పు
» నేటికీ వలంటీర్లను వెంటేసుకువెళ్తున్న బీఎల్వోలు
» విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం సమావేశం

జాబితాపై సమాధానమేది ?

జిల్లాలో ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో విడుదల చేసిన ఓటర్ల జాబితాపై ప్రతిపక్ష నాయకులు ఆది నుంచి పలు అనుమానాలు వినిపిస్తున్నాయి. ఫారం-6, 7, 8లపై అధికారుల ధోరణిని తప్పు పడుతూనే ఉన్నాయి. వినతి పత్రాలు, ఆధారాలు అంటూ ఎన్ని రకాలుగా మొత్తుకుంటున్నా కొందరు అధికారులు పట్టించుకోవడం లేదు. ఓటర్ల జాబితాలో సమస్యలు తలెత్తాయని, తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గత ఏడాది అక్టోబరులో ప్రతిపక్ష నాయకులు ఏలూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి అందిన సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ఏ ఏ నియోజకవర్గాల్లో ఎన్నెన్ని సమస్యలు కుప్పలుగా ఉన్నాయన్నది పూర్తి సంఖ్యలతో వివరిస్తూ వినతి పత్రాలు అందజేశారు. మరోమారు విడుదలయ్యే జాబితా తర్వాతనే ఆ సమస్యలు పరిష్కారమయ్యాయా ? లేదా ? అన్నది తెలుస్తుంది. ఈలోపు విన్నవించుకున్న నాయకులకు కనీస సమాచారం అందించలేదు. అసలు ఆ సమస్యలు తీర్చకుండానే పరిష్కరించామని అధికారులు నివేదికలు చూపించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

57,669 ఓట్లు ఏమయ్యాయి ?

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో మరణాలు, డబుల్ ఎంట్రీలు, శాశ్వత వలసలు, ఒకే ఇంటి నంబర్లలో అధిక సంఖ్యలో నమోదైన ఓట్లు, జీరో డోర్ నంబరు వంటి ఎనిమిది రకాల సమస్యలు ఓటర్ల జాబితాలో ప్రతిపక్ష నాయకులు గుర్తించారు. ప్రతీ నియోజకవర్గంలో ఆయా సమస్యల వారీగా నిర్వహించిన సర్వేల ప్రకారం 57,669 మంది ఓటర్లకు సంబంధించి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సమస్యలపై కొన్ని నెలలుగా సంబంధిత బీఎల్వోలను సంప్రదించినా పరిష్కారం లభించలేదు. పలు అధికారిక సమావేశాల్లో ప్రశ్నిస్తే మాత్రం ఫిర్యాదు చేయండి పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు, అర్జీలు అంది నెలలు గడుస్తున్నా మిన్నకుంటున్నారు. విసిగిపోయిన నాయకులు ఏకంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కే వినతులు అందించారు. ఒక్కో నియోజకవర్గంలో ప్రభుత్వం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో తప్పుల తడకలతో నిండిపోయాయని వివరించారు. త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ కూడా స్పందించారు. ఈ రోజుకీ ఎన్నికల అధికారుల నుంచి ఆ అర్జీలపై స్పందన లేదు. కలెక్టర్ ఆదేశాల కొద్దీ స్థానిక వలంటీర్లను వెంటేసుకుని ఆయా చిరునామాలకు వెళ్తున్న అధికారులు సమస్యలను మాత్రం పరిష్కరించలేదని తెలుస్తోంది. గతనెలలో కేంద్ర ఎన్నికల సంఘంతో జరిగిన సమావేశంలో సైతం అధికారులు పలు సమస్యలన్నీ పరిష్కరించేశామని, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని సమాధానమిచ్చారు. కానీ నేటికీ తాము ఇచ్చిన జాబితా వారీ అర్జీలను మాత్రం అధికారులు పట్టించుకోలేదని ప్రతిపక్ష నాయకులు వివరిస్తున్నారు. ఇక నేడు జరగబోయే సమావేశం ద్వారా అయినా వాస్తవాలు వెలుగులోకి తేవాలని అధికారులను అటు ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

బీఎల్వోల ప్రదక్షిణలు

ఓటర్ల జాబితా సర్వే మొదలైనప్పటి నుంచి బీఎల్వోలు, వలంటీర్ల స్నేహ హస్తం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. వలంటీర్లను సర్వేలో గానీ ఎన్నికల వ్యవహారాల్లో వేలు పెట్టనివ్వద్దని న్యాయస్థానాలు ఆదేశిస్తున్నా జిల్లాలో నేటికీ ఆ స్నేహ హస్తం కొనసాగుతూనే ఉంది. అధికారుల ఒత్తిడో లేదా వలంటీర్లు పక్కన లేకపోతే పని చేయలేకో తెలీదు గానీ మొత్తానికి ప్రతీ సర్వేకు వలంటీర్లను వెంటేసుకునే సర్వే నిర్వహిస్తున్నారు. కొద్ది నెలల క్రితం ప్రతిపక్షం తరఫు నుంచి దాదాపు ఎనిమిది అంశాల్లో వేలాదిగా ఓటర్ల నమోదులో తప్పులు దొర్లాయని పూర్తి ఆధారాలతో నాయకులు ఓ జాబితా అందించారు. త్వరలోనే ఆ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపిన అధికారులు, మరుసటి రోజు నుంచే వలంటీర్లను వెంటబెట్టుకుని ఆయా డోర్ నంబర్లకు వెళ్లి సర్వేలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో జీతాలు తీసుకుంటూ ఏదేని ప్రభుత్వ సంస్థకు సంబంధం లేని వలంటీర్లను ఒక రాజకీయ పార్టీ ఇచ్చిన నివేదికపై పనిచేయించడం సమంజసం కాదని రాజకీయ పక్షాలు నిలదీస్తున్నాయి. అయినా సరే అధికారులకు పట్టడంలేదు. ఇచ్చిన వినతులపై స్పష్టత ఇవ్వని అధికారులు ఎన్నికల సంఘానికి మాత్రం సర్వం సిద్ధమని, ఓటర్ల జాబితాలు, ఈవీఎంలు వగైరాలను సర్వాంగ సుందరంగా సిద్ధం చేశామని మాత్రమే చెప్పుకొస్తూ, స్థానిక సమస్యలను పైవరకూ తీసుకెళ్లలేకపోతున్నారన్న విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి. విజయవాడలోని అక్కడి ఓ ప్రైవేట్ హోటల్లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ తన ఆధ్వర్యంలో రాష్ట్రంలోని తొలుత రాజకీయ పార్టీ అధినేతలు, నాయకులతోనూ అనంతరం కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, ఎస్పీ మేరీ ప్రశాంతి కూడా ఆ సమావేశానికి హాజరయ్యారు.

తగ్గేదేలే..

» ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్లో రెండుగంటల బైఠాయింపు
» అక్కడే భోజనాలు.. ట్రాఫిక్‌కు అంతరాయం

ఎస్మాకు ఎదురొడ్డి అంగన్‌వాడీల పోరాటం





అస్వస్థతకు గురైన బేబి చిన్నారి ఆసుపత్రికి తీసుకెళుతున్న దృశ్యం



ఫైర్‌స్టేషన్ సర్కిల్లో బైఠాయించిన అంగన్‌వాడీలు, స్తంభించిన ట్రాఫిక్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 9 : అత్యవసర సేవల కిందకు వచ్చే ఉద్యోగులు, కార్మికులు సమ్మెలోకి వెళ్లకుండా ఉండేందుకు ఉద్దేశించిన ఎస్మా చట్టాన్ని రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై ప్రయోగించింది. సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే చర్యలు తప్పవని హెచ్చరించింది. అయితే అంగన్‌వాడీలు ఎస్మాకు ఎదురొడ్డి పోరాడుతున్నారు. ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నా వెనక్కి తగ్గేదేలేదని సమ్మెను కొనసాగిస్తున్నారు. మంగళవారం సమ్మె 29వ రోజుకు చేరుకుంది. ఉదయం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్లో అంగన్‌వాడీలు జైల్ భరో కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుంచి ప్రదర్శనగా బయల్దేరి ఫైర్‌స్టేషన్ వరకు కదం తొక్కారు. ఫైర్‌స్టేషన్ సెంటర్లో అంగన్‌వాడీలు రెండుగంటల పాటు బైఠాయించారు. కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతుగా పాల్గొన్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అరెస్ట్‌చేస్తే అంగన్‌వాడీలు ఆందోళన మరింత ఉధృతం చేస్తారని పోలీసులు వెనుకడుగు వేసి ట్రాఫిక్‌ను ఇతర మార్గాల ద్వారా మళ్లించారు. ఆందోళనకు ఏలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణ, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డిఅప్పలనాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి బి.వెంకట్రావు మాట్లాడుతూ జగన్‌ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వీరి సమస్యలను జఠిలం చేస్తుందని విమర్శించారు. ఈ పోరాటం రాష్ట్ర ఉద్యమాల చరిత్రతోనే రికార్డు సృష్టించబోతుందని ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్మాచట్టం అంగన్‌వాడీలను ఏమీ చేయదని మరోధైర్యం నింపారు. చివరి వరకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ, ఆశావర్కర్లు, మధ్యాహ్నం భోజన సంఘం, ఆటో యూనియన్ తదితరులు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్పృహ తప్పిన అంగన్‌వాడీ..

అంగన్‌వాడీలు ఫైర్‌స్టేషన్ బైఠాయింపులో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్త బేబీ చిన్నారి స్పృహతప్పి తీవ్ర అనారోగ్యం పాలైంది. రెండు గంటల పాటు బైఠాయించడంతో ఆమె స్పృహతప్పి పడిపోవడంతో అనారోగ్యం పాలైంది. ఆమెను హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిరవధిక సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు నాలుగో రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో దెందులూరు, ఏలూరు, కలిదిండి, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

2.30 లక్షల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలి

జగన్ కళ్లు తెరిచి నియామకాలు చేపట్టాలి : విద్యార్థి సంఘాల ధర్నా



ఫైర్‌స్టేషన్ సర్కిల్లో ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9 :పలు ప్రభుత్వశాఖల్లో ఖాళీగావున్న 2.30 లక్షల ఉద్యోగాల భర్తీకి ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికైనా కళ్ళుతెరిచి నియామకాల ప్రక్రియను చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ సంఘాల జిల్లానాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు ఫైర్‌స్టేషన్‌సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో పీడీ ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం, పీవైఎల్ డివిజన్ కార్యదర్శి టి.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 50వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగనియామకాలకు అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచాలని, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు ఫిజికల్ ఈవెంట్స్‌ను నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతీయువకులు లక్షలాదిగా పెరిగి, ఉద్యోగావకాశాలులేక పలువురు అడ్డె ఆటోలు నడపడం, తాపీ పనులకు వెళుతున్నారని, పూట గడవకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ధర్నాలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.నాని, మహర్షి, ఉపాధ్యక్షులు వినోద్, క్రాంతి, పీవైఎల్ నాయకులు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ముక్కరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం దారెటు ?

» రెండు రోజులపాటు ఏలూరులో రాష్ట్ర కార్యవర్గం భేటి
» రాజకీయ అంశాలపై సుదీర్ఘ చర్చ
» వచ్చే ఎన్నికల్లో పోటీపైనా ఆచితూచి నిర్ణయాలకు అవకాశం

ప్రజా ఉద్యమాల్లో నిరంతరం మునిగితేలే వామపక్షాలు ఎన్నికల వేళ బరిలోకి దిగే వ్యూహానికి పదును పెడుతున్నాయి. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఏలూరులో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో తమ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలో సుదీర్ఘ చర్చ జరగనుంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి దీటుగా నిలబడే దిశగా సీపీఎం అడుగులు వేస్తుంది.



నగరంలో సీపీఎం నేతల ర్యాలీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :
సర్కారు ఏదైనా ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే వాటిపై సీపీఎం, అనుబంధ సంఘాలన్నీ ఎలుగెత్తి, ప్రజా ఉద్యమాలతో తలపడుతాయి. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగున్నరేళ్లుగా విరామం లేని ప్రజా ఆందోళనలు చేపట్టింది. ఏనాడూ వెనుకంజ వేయలేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అప్పట్లో జనసేనతో పొత్తుకు లోబడింది. ఆ దిశగానే ఈ రెండు పార్టీల పరస్పర సహకారంతో రణరంగంలోకి దిగాయి. అప్పట్లో ఉండి నుంచి సీపీఎం అభ్యర్థిగా బలరాం పోటీపడి అనూహ్యంగా 30 వేలకుపైగా ఓట్లు లభించడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సీపీఎం తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటూ వచ్చింది. బీజేపీకి వ్యతిరేకంగా సమర శంఖం ఊదింది. ఆ పార్టీకి వ్యతిరేకంగా ప్రజల్లోనూ చైతన్యం కలిగించేలా సుదీర్ఘ ఆందోళనలు చేసింది. కేంద్రంలో ప్రధాని మోదీ విధానాలను తప్పుపట్టింది. ఎర్ర జెండానే ప్రజలకు బాసట అనే దిశగా ఉద్యమాలకు కొత్త ఊపిరి ఇచ్చింది. జగన్ సర్కార్ అక్రమ కేసులు పెడుతున్నా, గృహ నిర్బంధాలకు పాల్పడుతున్నా, ఆందోళన, ఉద్యమాలకు అడ్డుపడు తున్నా బేఖాతర్ చేస్తూనే సీపీఎం నాయకత్వం ముందడుగు వేసింది. తమకు అనుబంధంగా ఉన్న కార్మిక, ఉద్యోగ సంఘాలన్నింటికి ఈ పార్టీనే అండగా నిలబడుతూ ఆందోళన కొనసాగిస్తూ వచ్చింది. ఉద్యోగులకు అన్యాయం జరిగితే ఉద్యమ శంఖం ఊదింది. ఉపాధ్యాయులకు ఎక్కడైనా నష్టం వాటిల్లినా, జీతభత్యాల్లో ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఉద్యమాలకు వెనుకాడలేదు. ఇప్పుడేమో మునిసిపల్ కార్మికులు ఒకవైపు, అంగన్‌వాడీలు ఇంకోవైపు, సమగ్రశిక్ష ఉద్యోగులు మరోవైపు ఉద్యో గ సంఘాలు రాష్ట్రం నలుదిశగా ఆందోళనలకు దిగితే బాసటగా నిలుస్తుంది వామపక్షాలే.

జిల్లా సమగ్రాభివృద్ధిపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

ఏలూరు టూ టౌన్, జనవరి 9: జిల్లా సమగ్రాభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధిలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఏలూరు కాశీవిశ్వేశ్వరరావు కల్యాణ మండపంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు మంగళవారం జిల్లా కార్యదర్శి రవి అధ్యక్షతన మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం జిల్లా అభివృద్ధికి దూరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 16 రకాల ప్రభుత్వ భూములు మూడు లక్షలకు పైగా ఉన్నాయ న్నారు. ఈ భూములను భూమిలేని ఆరు లక్షల వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేయాలన్నారు. భూయాజమాన్య హక్కుచట్టం వల్ల రైతులు నష్టపోతారని అన్నారు. భూయాజమాన్య హక్కుచట్టం కార్పొరేట్, పారిశ్రామిక వర్గాలకు ఉపయోగపడుతుందని రైతులు నష్టపోయే చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఈ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్య, వైద్యం రాష్ట్రం లో ఖరీదైపోయాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారామ్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. తొలుత ప్రభుత్వాసుపత్రి నుంచి కల్యాణ మండపం వరకు కవాతు నిర్వహించారు. కళాకారుల నృత్యం, డప్పులు, పాటలు ఆకట్టుకున్నాయి. శ్రీనివాస్, కిషోర్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

రెండు రోజులపాటు సమగ్ర చర్చ..

ఏలూరులోని కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో రెండు రోజులపాటు సాగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వాన సమగ్రంగా కార్మిక, ఉద్యోగ, సమగ్రశిక్ష ఉద్యోగ సంఘాల ఉద్యమాలపై చర్చించబోతున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రజా ఆందోళనలు, జగన్ సర్కార్ అరాచకాలు, వేధింపులు, ఒత్తిళ్ళపైన కార్యవర్గంలో చర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకోబోతున్నారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వి.రాఘవులు, ఎం.బేబితో సహా 80 మంది ప్రతినిధులు కార్యవర్గ సమావేశంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే ప్రతినిధులు కొందరు ఏలూరుకు చేరుకోగా, బుధవారం నాటికి మిగతా వారంతా చేరుకోబోతున్నారు. ఆ ప్రాంగణాన్ని అంతా పార్టీ పతాకాలతో నింపేశారు.

రాజకీయ అంశాలపై ఓ నిర్ణయానికి..


వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ ఎలా వ్యవహరించాలో ఒక నిర్దిష్టమైన నిర్ణయానికి వీలుగా పలు అంశాలను కార్యవర్గం చర్చించబోతుంది. గతంలో జనసేన, వామపక్షాలు ఉమ్మడిగా కూడబలుక్కుని ఎన్నికల్లో మిగతా పక్షాలతో తలపడ్డాయి. బీజేపీని ఆసాంతం వ్యతిరేకించే పక్షాలతోనే తమ అడుగులు వేయాలని మొదటి నుంచి వామపక్షాలు ఓ నిర్ణయానికి వచ్చి ఆ విధానాన్నే కొనసాగిస్తున్నాయి. ఒక దశలో తెలుగుదేశం, జనసేనతో కలిసి నడిచే అవకాశాలపై పార్టీలోను అక్కడక్కడ రాజకీయేతర చర్చ జరిగింది. ఇంకోవైపు టీడీపీ, జనసేనతోపాటు బీజేపీ పొత్తు పెట్టుకుంటే రాజకీయ సమీకరణలే పూర్తిగా మారబోతున్నాయి. ఇక అలాంటి పరిస్థితే వస్తే వామపక్షాలు అడుగులు ఒంటరిగా వేస్తారా, లేకుంటే కాంగ్రెస్‌తో జతకడతారా అనే దానిపైనే ఇప్పుడు ఊహాగానాలు సాగుతున్నాయి.

కోడి పందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు

» కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 9 : జిల్లాలో కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ హెచ్చరించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కోడిపందేలు, బెట్టింగ్‌లు నిర్వహించడం, ప్రోత్సహించడం, పాల్గొనడం చట్టవిరుద్ధమన్నారు. ఉత్తర్వులు అతిక్రమిస్తే చట్టప్రకారం శిక్షార్హులు అని హెచ్చరించారు. ఏలూరు జిల్లాలో ఎవరైనా ఉత్తర్వులు అతిక్రమిస్తే సమాచారాన్ని జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08812-2224519 నంబర్‌కు తీసిన ఫొటోలు, వీడియోలు వాట్సాప్ నంబర్ 9491041428కు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

అర్ధరాత్రి పోలీసు తనిఖీలు



లారీ డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జనవరి 9: జిల్లాలో పోలీసులు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రివేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తుగా రాత్రిపూట ఆ ప్రాంతాలను తనిఖీలు చేశారు. గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా జరుగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు.

అడ్డుకట్టకు మోక్షమెప్పుడో..?



సముద్ర కోత నివారణకు అడ్డుకట్ట పనులు ముందుకు సాగడం లేదు. ఇంకా చెన్నై ఐఐటీ నిపుణులు పరిశోధన చేస్తూనే ఉన్నారు. మరోవైపు ప్రతిఏటా తుఫాన్‌లు, భారీ వర్షాలకు కోత మరింత పెరిగిపోతోంది. గత ఏడాదితో పోలిస్తే అర కిలోమీటర్ మేర సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. దీంతో తీరప్రాంత వాసులు భయం గుప్పెట్లో బిక్కుబిక్కుమంటున్నారు. పనులు మొదలు పెడితే కోతనివారణ కొంతమేరైన తగ్గుతుందని ఎదురు చూస్తున్నారు.

- పెరుగుతున్న సముద్ర కోత
- భయం గుప్పెట్లో తీరప్రాంత వాసులు
- ప్రకృతి వైపరీత్యాల్లో ముందుకు చొచ్చుకొస్తున్న వైనం

నరసాపురం, జనవరి 9: గడిచిన పదేళ్ల నుంచి తీర ప్రాంతంలో సముద్ర కోత ప్రతిఏటా పెరుగుతూ వస్తుంది. ఇప్పటికే చినలంక గ్రామం సముద్రగర్భంలో కలిసిపోయింది. కనీసం ఆ గ్రామ ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. దీంతో గ్రామ స్థులు వేములదీవి శివారున తలదాచుకుంటున్నారు. ఇటు పీఎంలంక గ్రామం సముద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండేది. ప్రస్తుతం ఈ దూరం ఆరకిలోమీటర్ కు వచ్చేసింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా కోత పెరుగుతూ వస్తుంది. గతంలో సముద్రానికి ఒక కిలోమీటర్ దూరంలో ఆలయం ఉండేది. నేడు సముద్ర గర్భంలో కలిసిపోయింది. ఇటీవల మరో ఆలయాన్ని నిర్మించారు. ఆ సమయంలో అరకిలోమీటర్ దూరంలో ఉంది. ప్రస్తుతం సముద్రానికి 100 మీటర్ల దూరంలో ఉంది. ఇలా కోత పెరుగుతుండడంతో ఏదో ఒక రోజు తమ గ్రామం కూడా చినలంక మాదిరిగా కడలిగర్భంలో కలిసిపోతుందన్న భయం పీఎంలంక వాసుల్లో నెలకొంది.

కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ హామీ..

ఎనిమిదేళ్ల క్రితం కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి పనులు చేశారు. దేశంలోనే పీఎంలంక గ్రామం దత్తత గ్రామాల్లో ఆదర్శంగా నిలిచింది. గ్రామస్థులు సముద్ర కోతను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. స్వయంగా పరిశీలించి కోత నివారణకు డీఆర్‌డీఏ శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయించారు. ఓడరేవుల్లో ఉండే విధంగా కోత నివారణకు సముద్రం పొడవున సిమెంట్ రాళ్ల వేయాలని సూచించారు. దీని అంచనా వ్యయం వందల కోట్లు ఉండటంతో ఈ పనులు ముందుకు సాగలేదు. గత ఏడాది నవంబరులో మళ్లీ ఆమె గ్రామానికి విచ్చేసినప్పుడు తరుముకొస్తున్న ప్రమాదాన్ని గ్రామస్థులు మంత్రికి గుర్తు చేశారు. స్పందించిన ఆమె చెన్నై ఐఐటీ నిపుణుల చేత పరిశోధనలు చేయించారు. నివారణ పనులకు ప్రముఖ కార్పోరేట్ సంస్థ డెలైట్ ముందుకొచ్చింది. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తొలి విడత 1,000 మీటర్ల మేర చేపట్టే పనులకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. ఇందుకు సుమారు రూ. 15 నుంచి రూ.20 కోట్లు ఖర్చవుతుందని అంచన వేశారు.

ఇంకా పరిశోధనలోనే..

గత ఏడాది నుంచి చెన్నై ఐఐటీ నిపుణులు పలు మార్లు గ్రామాన్ని సందర్శించారు. కోతకు గల కారణాలు, నివారణ చర్యలపై అధ్యయనం చేసి సూచనలు చేశారు. ముంబై తరహాలో ట్యూబ్‌ల్లో రసాయనాలు నింపి గోడ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదం ఎక్కువ ఉన్నచోట్ల పెద్దపెద్ద సిమెంట్ రాళ్లతో గోడ ఏర్పాటు చేస్తే కొంతమేర నివారించవచ్చునని సలహా ఇచ్చారు. అయితే నిపుణులు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. దీంతో ప్రారంభానికి నోచుకోలేదు. మరోవైపు ముందుకు సాగకపోవడంపై పలు వాదనలు వినిపిస్తున్నాయి. సముద్రంలో ఇసుక మేటలు పెరిగిపోవడంతో ఓవైపు కోతకు గురౌతుందని, తొలుత దీన్ని నివారిస్తే ఫలితం ఉంటుందని అంటున్నారు. ఈ పనులు చేయాలంటే డ్రెడ్జింగ్ చేయాలి, ఇందుకు రాష్ట్రం లేదా కేంద్రం నిధులు కేటాయించాల్సి ఉంటుంది. ఈ పనులు చేసిన తరువాత అడ్డుకట్ట పనులు ప్రారంభిస్తే కోత నివారించవచ్చునని మరో పరిశోధన బృందం సూచించినట్లు తెలిసింది.

34 ఎయిడెడ్ పాఠశాలల మూసివేత !

జీరో ఎన్‌రోల్‌మెంటే కారణమని విద్యా శాఖ వివరణ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9 : జీరో ఎన్‌రోల్‌మెంట్ కారణంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 34 ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలను మూసివేసేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 24, ఏలూరు జిల్లాలో 10 ప్రైమరీ స్కూళ్లను 2022-23 విద్యాసంవత్సరం యూ-డైస్ లెక్కల ప్రకారం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను, ప్రస్తుత విద్యాసంవత్సర ఎన్‌రోల్‌మెంట్‌ను సరిపోల్చుకుని జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నందున వీటి మూసివేతకు ఉత్తర్వులు ఇవ్వాలని ఉన్నతాధికారులు జిల్లాకు ఆదేశాలు పంపారు. ఈ విషయాన్ని డీఈవో శ్యాంసుందర్ ధృవీకరించారు. తాజా ఉత్తర్వుల మేరకు ఈ నెల 21లోగా 34 ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో మరోదఫా ఎన్‌రోల్‌మెంట్‌ను భౌతికంగా పరిశీలించి కనీస సంఖ్యలో కూడా బాలబాలికలు లేనట్టయితే వాటి మూసివేతకు ఆదేశాలను ప్రస్తుత విద్యాసంవత్సరం ముగిసేలోగా ఇస్తామని డీఈవో తెలిపారు. విద్యార్థులు నష్టపోకుండా సమీప ఆవాసప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తామని వివరించారు. కేడర్ స్ట్రెంగ్త్ ప్రకారం వున్న ఎస్జీటీ ఉపాధ్యాయులను కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటుచేస్తామన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామారావు

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 9 : సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.వి.రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీపీ స్కూల్(మెయిన్)లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నూతన పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతున్నందున వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలను, సరెండర్ సెలవు నగదు విడుదల చేయాలన్నారు. ప్రతినెల ఒకటినే జీతాలు చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర మాట్లాడుతూ, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఐటీడీఏ యాజమాన్యంలోని పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను మంజూరు చేయాలన్నారు. జిల్లా సబ్ కమిటీ సభ్యులు యు.వి. నరసింహారాజు, బి.శ్యాంసుందర్, జె.సోమేశ్వర శాస్త్రి, పీవీఆర్ రాజ్యలక్ష్మి, ఎస్.దొరబాబు, వి.గణేష్, ప్రకాష్‌రావు, ఎన్.భాస్కర్ వర్మ, టి.నారాయణదాస్, పి..జగదీష్, ఐ.వి.రత్నం, కె.సుబ్బారావు, ఎం.వర కుమార్, అబ్బులు, నాగేశ్వరరావు, దయరాజు, ఖండియ్య, శ్రీరాములు, ఎస్.ధర్మరాజు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 9: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్‌కు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం (టీఎన్ఏయూ) లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందించింది. కోయంబత్తూరులో ఉద్యాన రంగంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా టీఎన్ఎయూ వైస్ చాన్సలర్ వి.గీతాలక్ష్మి అందజేశారు. జానకీరామ్ 31 ఏళ్లుగా ఉద్యాన పరిశోధనా రంగంలో చేసిన కృషికి, నాయకత్వ ప్రతిభకు ఈ అవార్డు నిదర్శనం. చామంతి పూలలో పది రకాలు, లిల్లీ పూలలో నాలుగు హైబ్రిడ్ రకాలను, చైనా యూస్టర్‌లో ఆరు రకాలను, గ్లాడియోలస్‌పూలలో 10. ఇలా రకరకాల నూతన వంగడాలను జానకీరామ్ సృష్టించారు. రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు, ఇతర అధికారులు జానరామ్‌ను అభినందించారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పరిపాలన



మాట్లాడుతున్న డీపీవో విశ్వనాథ్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 9: ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీ పరిపాలన జరిగితే నిజమైన గ్రామస్వరాజ్యమని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ అన్నారు. జిల్లాపరిషత్ మందిరంలో పరిపాలన అధికారులకు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి కోఆర్డినేటర్స్‌కు రెండురోజుల శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో వెంకటసుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. శాఖలవారీగా అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధి ప్రణాళికల తయారీలో మహిళా భాగస్వామ్యం ఉండాలన్నారు. ప్రసంగిరాజు, డీఎల్‌పీవోలు చంద్రశేఖర్, సుందరి, డీపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

సామాజిక సమతకు విస్తృత ఏర్పాట్లు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలో సామాజిక సమత కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ ఆర్.విజయ్‌రాజు తెలిపారు. తన కార్యాలయంలో సామాజిక సమతా సంకల్పం నిర్వహణ ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ జిల్లాస్థాయిలో కమిటీని ఏర్పాటుచేసి సంబంధిత అధికారులకు దిశనిర్దేశం చేశారు. ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం ఈనెల 18వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో నిర్వహించే కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో విశ్వనాథ్, సోషల్‌వెల్ఫేర్ అధికారి జయప్రకాష్ పాల్గొన్నారు.

స్వ్యాయ్ పోటీల్లో ఏలూరు విద్యార్థులకు పతకాలు


పథకాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు స్పోర్ట్స్, జనవరి 9: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఈనెల నాలుగు, ఐదు, ఆరు తేదీల్లో 24వ జాతీయస్థాయి స్వ్యాయ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. వివిధ విభాగాల్లో ఏలూరుకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్ -14 బాయిస్, గరల్స్ విభాగంలో భార్గవ్ బంగారు పతకం, ఎమ్డీఓవైస్ బంగారు, ఏఎమ్‌రావ్ స్పై విభాగంలో శ్రీనివాస్ స్వర్ణపతకం సాధించగా, బాలికల విభాగంలో రమ్యశ్రీ స్వర్ణపతకం సాధించింది. అండర్ -18 బాలబాలికల విభాగంలో ఎమ్డీ అహ్మద్‌రాజా స్వర్ణపతకం, జయంత్ లోబోలో రెండోస్థానం సాధించగా, జి.అఖిల మూడోస్థానం సాధించినట్లు స్వ్యాయ్ కోచ్ ఎమ్డీ ఖాజా తెలిపారు. స్వ్యాయ్‌లో బంగారు పతకాలు సాధించిన వీరిని నిర్వాహకులు, నగర ప్రముఖులు, క్రీడాకారులు అభినందించారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు


తనిఖీలు చేస్తున్న అధికారులు

భీమడోలు, జనవరి 9 : పలు రేషన్ దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 6,500 కేజీల బియ్యంతో పాటు 72 ప్యాకెట్ల షుగర్, 33 కేజీల ఆటాలను స్వాధీన పర్చుకున్నారు. రికార్డుల లెక్కలకు, స్టాకు లెక్కలకు తేడాలు ఉండడంతో బియ్యాన్ని స్వాధీన పర్చుకుని సీజ్ చేసినట్లు సివిల్ సప్లై డీటీ మాధవరావు తెలిపారు. భీమడోలులో డీలర్లు కేతినీడి దుర్గాపల్లవి, మద్దాల వెంకటరత్నం దుకాణాలను తనిఖీలు చేశారు. అలాగే సంబంధిత రేషన్ పంపిణీ వాహనాల డ్రైవర్లు గోపిశెట్టి విజయరత్నం, పడాల నాగమోహన్‌పై కూడా 6ఏ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

యుక్త వయసు రాకుండా వివాహం చేస్తే రూ.లక్ష జరిమానా



మాట్లాడుతున్న డీసీపీవో సూర్యచక్రవేణి

పెదవేగి, జనవరి 9 : ఆడపిల్లలకు కనీస వయసు రాకుండా వివాహం చేస్తే బాల్య వివాహన నిరోధక చట్టం కింద రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్ల జైలుశిక్ష అమలు చేస్తారని జిల్లా బాలల సంరక్షణాధికారిణి (డీసీపీవో) సిహెచ్.సూర్యచక్రవేణి చెప్పారు. అమ్మపాలెంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో- బేటీ పడావో' (ఆడపిల్లలను రక్షిద్దాం-ఆడపిల్లలను చదివిద్దాం) కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహ చట్టంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు ఎంత తొందరగా పెళ్లి చేసి పంపిస్తే అంత మంచిదనే భావనతో కొందరు తల్లిదండ్రులు కనీస వయస్సు రాకుండానే పెళ్లి చేస్తున్నారన్నారనీ ఇది సరైన విధానం కాదన్నారు. కనీస వయసు 18 ఏళ్లు నిండాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి 18 ఏళ్ల లోపు బాలికల వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేసి, వారిని నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. బాలికల సంక్షేమం విద్యతోనే సాధ్యమన్నారు. బాలికావిద్యకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యావంతులైతేనే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణం సమాచారం అందించాలని సూర్యచక్రవేణి పేర్కొన్నారు. క్రాప్ ఎన్జీవో ప్రతినిధి ఎస్.రవిబాబు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ వైవీ.రాజు, పంచాయతీ కార్యదర్శి విజయ్ రమేష్, మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎం.కావ్య, కుసుమ, కె.సౌజన్య, డీసీపీయూ కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ఇళ్ల ప్లాన్ అప్రూవల్ అందని ద్రాక్ష!

- వీరవాసరం పంచాయతీలో పెండింగ్‌లో 70..
- అమలుకాని నిబంధనలు.. ఆవేదనలో గృహ నిర్మానదారులు

వీరవాసరం, జనవరి 9: భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వటం వలన ఫీజు రూపేణా పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. ప్రణాళికాబద్ధ గ్రామాభివృద్ధితో పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవచ్చు. నిబంధనల మేరకు గ్రామంలో 300 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం కలిగిన స్థలంలో నివాసయోగ్య భవన నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇవ్వవచ్చు అని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఈయూడీఏ) స్పష్టమైన సూచనలు ఇచ్చింది. 300 చదరపు మీటర్ల విస్తీర్ణం పైబడిన భవనాలు, షాపింగ్, కమర్షియల్ భవనాలకు ఈయూడీఏ అనుమతి తప్పనిసరి అని మార్గదర్శకాలను నిర్ధేశించింది. భవన నిర్మాణానికి పంచాయతీ బోర్డు సమావేశాల్లో ఆమోదించవలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ వీరవాసరం పంచాయతీలో నిబంధనలు అమలు కావటం లేదు. గృహ నిర్మాణదారులు ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేస్తే అనుమతి లభించటం లేదు. తొమ్మిది నెలల కాలంగా ప్లాన్ అప్రూవల్ కోసం వచ్చిన సుమారు 70 ఇళ్ల ప్లాన్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీనికి కారణం పంచాయతీకి శాశ్వత ప్రాతిపదికన గ్రామ కార్యదర్శి లేకపోవటమేనని చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది అయితే తాత్కాలిక కార్యదర్శులు చార్జ్ అప్పగించలేదని, రికార్డులేదని బాహాటంగా చెబుతున్నారు.

2022 ఏప్రిల్, జూన్ నెలల్లో అప్పటి కార్యదర్శి డి.శ్రీనివాసరాజు సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆరుగురు కార్యదర్శులు ఇక్కడ విధులు నిర్వర్తించలేమంటూ వెళ్లిపోయారు. ప్రస్తుతం ఏడో కార్యదర్శిగా ఈవోపీఆర్డీ విజయశారధిని నియమించారు. అయినప్పటికీ ప్లాన్ అప్రూవల్‌కు మోక్షం కలగటం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. అధికారులకు ఫిర్యాదు చేసుకోండి అని దురుసుగా సమాధానం ఇస్తున్నారని గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిఫారసులు ఉంటే చాలు..

పంచాయతీ కార్యదర్శిగా జె.డి.వి. ప్రసాద్.. ఎఫ్ఏసీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు ఈవోపీఆర్డీగా పదోన్నతి రావటంతో వేరే మండలానికి బదిలీపై వెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ప్లాన్ అప్రూవల్స్‌ను కొందరు గృహనిర్మాణదారులు నియోజవర్గస్థాయి ప్రజాప్రతినిధులతో సిఫారసు చేయించుకొని పంచాయతీలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కొందరికి అప్రూవల్ ఇచ్చారని సమాచారం. కొందరు ప్లాన్ అప్రూవల్ లేకుండానే ఇంటి నిర్మాణాలు పూర్తిచేసేశారు. బ్యాంకు రుణాలు ఆశించే మరి కొందరు అప్రూవల్ కోసం పంచాయతీ చుట్టూ తిరుగుతున్నారు.

ఏసీబీ వలలో వీఆర్వో

- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఏసుబాబు


పట్టుబడిన వీఆర్వో

పెనుగొండ, జనవరి 9: సిద్ధాంతంలో ఓ రైతు నుంచి వీఆర్వో జంపా ఏసుబాబు రూ.ఎనిమిదివేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ శరత్ బాబు వివరాలు వెల్లడించారు. సిద్ధాంతం శివారు ఘటాలదిబ్బకు చెందిన మామిడిశెట్టి సత్యనారాయణకు తన పట్టాదారు పాసు బుక్‌లో ఉన్న 0.50 సెంట్ల భూమి ఉంది. ఆన్‌లైన్‌లో 0.30ట్లు భూమి మాత్రమే ఉండటంతో మిగిలిన 0.20 సెంట్ల భూమి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆన్‌లైన్ 0.20 సెంట్లు అప్‌లోడ్ చేయడానికి వీఆర్వో రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. గత నెలలో రూ.రెండు వేలు లంచం ఇచ్చారు. మిగిలిన ఎనిమిదివేల కోసం ఆఫీసు చుట్టు తిప్పించుకున్నాడు. విసుగుచెందిన రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వీఆర్వో ఏసుబాబు రూ. 8 వేలు లంచం తీసుకుంటుండగా మంగళవారం రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నామని డీఎస్పీ వివరించారు. ఏసీబీ సీఐలు ఎన్.వి. భాస్కరరావు, నాగేంద్రబాబు, శివ ప్రసాద్, హ్యాపీ కృపానందం, సిబ్బంది ఉన్నారు.

పెనుగొండ తహసీల్దార్ కార్యాలయంలో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉద్యోగుల జేబులు చెక్ చేసి రికార్డులను పరిశీలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.


అభినందిస్తున్న వీసీ

ఎన్ఎస్ఎస్ సాహసయాత్ర విజయవంతం

రాజమహేంద్రవరం, జనవరి 9: యువజన వ్యవహారాల క్రీడాశాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ కేంద్రం పోంగ్‌డామ్ వద్ద నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సాహసయాత్రను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విజయవంతంగా పూర్తిచేశారని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. గత నెల 19 నుంచి 28 వరకు ఈయాత్ర సాగిందన్నారు. నన్నయ వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఒక పీవో హాజరయ్యారన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎన్.రాజశేఖర్, కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ నుంచి ఐ.ఆనందబాబు, నన్నయ క్యాంపస్ నుంచి ఎస్.సందీప్, ఎస్.జానకిరామ్, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం నుంచి జి.ఆది, భీమవరం బీవీ రాజు కాలేజ్ ఆఫ్ సైన్స్ నుంచి పి.దుర్గాగణేష్, గైట్ కళాశాల నుంచి సిహెచ్. చరిష్మా, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి పి.సాయిరత్నం, కిర్లంపూడి ఎస్వీవీఎస్ డిగ్రీ కళాశాల నుంచి ఆర్.ఉష, రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి కె.హర్షిణి, పాలకొల్లు డీఎన్ఆర్ మహిళా కళాశాల నుంచి ఎస్.లక్ష్మీదేవి పాల్గొన్నారన్నారు. మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా తమ సాహసయాత్రను కొనసాగించారని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు అభినందించారు.

తొళక్క వాహనంపై శ్రీవారికి తిరువీధిసేవ


స్వామికి హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, జనవరి 9: చినవెంకన్న క్షేత్రంలో ధనుర్మాస పర్వదినాలను పురస్కరించుకుని స్వామివారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. అనంతరం విలాస మండపంలో ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. తొలుత గోదాదేవి, ఉభయదేవేరులతో శ్రీవారిని తొళక్కవాహనంలో ఆశీనులుగావించి పుష్పాలంకారం చేశారు. అనంతరం అట్టహాసంగా క్షేత్ర తిరువీధుల్లో గజ, అశ్వసేవల నడుమ గ్రామోత్సవం జరిపారు. భక్తులకు కనువిందు చేసింది.

నేత్రపర్వం.. ఏకాదశ రుద్రాభిషేకం


నందివాహనంపై ఊరేగుతున్న శివుడు

నందివాహనంపై కొలువైన శివయ్య మంగళవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం భక్తులను అలరించింది. తొలుత ఆలయపరిసరాలను పుష్పమాలికలు, మామిడితోరణాలతో సుందరీకరించారు. గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషే కాన్ని నిర్వహించారు. రాత్రి నందివాహనంపై జరిగిన గ్రామోత్సవం చూపరులకు నేత్రపర్వమైంది.

మావుళ్లమ్మ ఆదాయం రూ.27.47 లక్షలు

భీమవరంటౌన్, జనవరి 9 : మావుళ్లమ్మ అలయ హుండీలను మంగళవారం లెక్కించగా రూ. 27,47,385 ఆదాయం లభించిందని దేవస్థానం సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. 64 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 153 గ్రాముల 700 మిల్లీగ్రాముల వెండి వచ్చిందని వివరించారు. 40 రోజులకు ఈ ఆదాయం లభించిందన్నారు. దేవదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ముత్యాల వెంకట రామరావు, చెల్లంకి నాగేషగిరి, మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, నీలాపు వెంకట లక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు ఉన్నారు.

గాంధేయవాదంపై కవితా రచనల పోటీలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9 : మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో సీనియర్ రచయితలకు కవితా రచనల పోటీలను నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'మనది గాంధేయవాదం-రావాలి గాంధీయుగం' అనే అంశంపై 25 ఏళ్లు దాటిన రచయితలందరూ పోటీలో పాల్గొనవచ్చునన్నారు. 40 పంక్తులకు మించకుండా రచనలను డీటీపీచేసి ఈ నెల 25లోగా కార్యదర్శి, సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2 చిరునామాకు పోస్టుద్వారా పంపాలని కోరారు. విజేతలకు ఈ నెల 30న పెదనిండ్రకొలనులోని మహాత్మాగాంధీ భవన్‌లో నిర్వహించే కవిసమ్మేళనం సందర్భంగా గా బహుమతులు అందజేస్తామని వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

యలమంచిలి, జనవరి 9: క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయని తహసీల్దారు యం.సునీల్‌కుమార్, ఎంపీడీవో సిహెచ్.త్రిశూలపాణి అన్నారు. మూలస్థానేశ్వరి అమ్మవారి సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆకుల దొరబాబు మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను వీరు మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, యువత క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవాలన్నారు. యువతను ప్రోత్సహించేందుకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ టోర్నమెంటులో 20 జట్లు పోటీపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. తాళ్లూరి బుజ్జిబాబు, సర్పంచ్ మేరీ, చిలుకూరి రాజ్యలక్ష్మి, పాలా శ్రీనివాస్, బొప్పన రాంబాబు, తాళ్లూరి చందు, సిద్దాని రాము, ఆకుల ఏసు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహితపై అత్యాచారం..కేసు నమోదు

ఉండి, జనవరి 9 : వివాహితపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. స్థానిక చిక్కాలవీరన్ననగర్‌కు చెందిన వివాహితకు 1995లో వివాహమైంది. ఆమెకు ఓ కుమారుడు వున్నాడు. ప్రస్తుతం భర్తతో విడిపోయి ఆమె వేరుగా జీవిస్తోంది. గ్రామంలోనే ఉన్న తన సోదరుడితో కలిసి వుంటోంది. అతడి స్నేహితుడు కారుమూరు వీరవెంకటసత్యప్రదీప్‌కుమార్ (44) తరుచూ బాధితురాలి సోదరుడి కోసం వస్తువెళ్తుంటాడు. ఈనెల ఏడవ తేది రాత్రి ఇంట్లో ఆమె ఒక్కతే ఉంది. ఆ సమయంలో ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ విషయం ఆమె కుటుంసభ్యులకు చెప్పింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఉండి ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి నాలుగేళ్ల జైలుశిక్ష

నరసాపురం/పోడూరు, జనవరి 9: మద్యం మత్తులో హత్యాయత్నం చేసిన నిందితుడికి నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.100 జరిమాన విధిస్తూ మంగళవారం నరసాపురం కోర్టు తీర్పు చెప్పింది. లైజన్ అధికారి ఉభయభాస్కర్‌రావు వివరాల ప్రకారం.. పాలకొల్లుకు చెందిన వడ్డాది ఏసు, శరత్‌బాబుల మధ్య పాత గొడవలు ఉన్నాయి. శరత్‌బాబు ట్రాన్స్‌జెండర్. రోడ్డుపై వెళ్లే వారిని డబ్బులు అడుగుతాడు. ఇవ్వకపోతే గొడవ పడతాడు. ఈక్రమంలో గత ఏడాది జూలైలో పట్టణంలో స్వాగత్ బార్ వెనుక ఏసును చూసి డబ్బులు అడిగాడు. ఏసు నిరాకరించడంతో పక్కనేఉన్న చెక్కతో శరత్‌బాబు తలపై బాదాడు. పీక పట్టుకుని గోడకేసి కొట్టాడు. మూతి, మోహంపై గుద్ది కిందపడేసి కొడుతుండగా సమీపంలో ఉన్న కొందరు చూసి కేకలు వేశారు. దీంతో శరత్ పారిపోయాడు. ఏసును ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించడంతో అతడు కొలుకున్నాడు. అప్పటి పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాస్ ఏసు స్టేట్‌మెంట్ రికార్డు చేసి శరత్‌బాబుపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో అసిస్టెంట్ సెక్షన్ జడ్జి వై. శ్రీనివాసరావు నిందితుడికి పైన పేర్కొన్న విధంగా శిక్ష విధించినట్లు భాస్కర్‌రావు చెప్పారు. నేరం రుజువు చేయడంలో పీపీ నల్లిమిల్లి జోసఫ్, వంశీధర్ కీలకంగా వ్యవహరించారన్నారు.

కోడికత్తులు తయారీ.. వ్యక్తి అరెస్టు

కొయ్యలగూడెం, జనవరి 9: కోడికత్తులు తయారు చేస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివి. కన్నాయిగూడెంలో ఓ వ్యక్తి కత్తులకు సానపడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడిచేసి అతడిని పట్టుకున్నారు. 102 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా కోడికత్తులు తయారుచేసిన, అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విష్ణువర్ధన్ హెచ్చరించారు.

25 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఏలూరు క్రైం/పెదవేగి, జనవరి 9 : వేర్వేరు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి 25 మందిని అరెస్ట్ చేశారు. వివరాలివి. ఏలూరు ఆర్ఆర్‌పేటలో ఓ ఇంట్లో పేకాట టూటౌన్ సీఐ ప్రభాకర్‌కు సమాచారం అందింది. ఎస్ఐలు సాదిక్, శుభశేఖర్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి దాడి చేశారు. పది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.38 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు సీఐ ప్రసాద్ కుమార్ తన సిబ్బందితో లింగపాలెం మండలం వేములపల్లిలో దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి రూ.10,600 నగదు, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు తదుపరి చర్యలు నిమిత్తం ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసి, వారివద్దనుంచి రూ.5,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.విజయరాయిలో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1700 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎం.లక్ష్మణ్ చెప్పారు. కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

చేపల లారీ బోల్తా.. డ్రైవర్ మృతి



ఖమ్మంరూరల్, జనవరి 9: చేపల లోడుతో వెళుతున్న ఓ లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడటంతో డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా, ఖమ్మంరూరల్ మండలం, ఆరెంపుల గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు పట్టణం నవాబ్‌పేట్ ప్రాంతానికి చెందిన మారడాని బాలబాలాజీ (38) లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. క్లీనర్ తానికొండ నరేష్ కుమార్‌తో కలిసి చేపలలోడుతో ఏలూరు నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌కు వెళుతున్నాడు. మార్గం మధ్యంలో ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల గ్రామం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టి బోల్తాపడింది. డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే రూరల్ ఎస్ఐ సురేష్ ఘటన స్థలాన్ని సందర్శించారు. అన్నం ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్‌రావు బృందం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీని ఎక్స్‌కవేటర్‌తో బయటకు తీశారు. వేరే లారీలో చేపలను లోడు చేసి పంపించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

25లోగా గిడ్డంగుల నిర్మాణం పూర్తి చేయాలి : జేసీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలో ఈనెల 25వ తేదీనాటికి 43 బహుళార్థ ప్రయోజన గిడ్డంగుల నిర్మాణం పూర్తి చేయాలని మార్కెటింగ్‌శాఖ డీఈఈ, సంబంధిత కాంట్రాక్టర్‌లను జేసీ బి.లావణ్యవేణి ఆదేశించారు. ఏలూరులో ఫేజ్ -1లో నిర్మిస్తున్న బహుళార్థ ప్రయోజన గిడ్డంగుల పురోగతిని కాంట్రాక్టర్లు, డీఈలు, అధికారులు మార్కెటింగ్, జిల్లా సహకార అధికారులతో మంగళవారం సమీక్షించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఫేజ్ -1లో 43 నిర్మాణానికి 41 గిడ్డంగులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, 18పూర్తికాగా రెండు గిడ్డంగులు మాత్రమే డ్రైయింగ్ యార్డుతో సహా పూర్తయినట్లు డీఈఈ తెలిపారు.

మధ్యాహ్న భోజనం మెస్ చార్జీలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజు

కామవరపుకోట, జనవరి 9: మధ్యాహ్న భోజన కార్మికులకు మెస్ చార్జీలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు టీవీఎస్.రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులందరూ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను అమలుపర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, భోజన కార్మికుల నాయకురాలు షేక్ షకీరమ్మ, రాజేశ్వరి, జగదాంబ, ఎన్.సరస్వతి, దుర్గ, పుష్ప, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కొండరెడ్ల అభివృద్ధికి మరిన్ని పథకాలు : ఐటీడీఏ పీవో


కొండరెడ్లతో మాట్లాడుతున్న పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం, జనవరి 9: కొండరెడ్ల అభివృద్ధికి ప్రధాన మంత్రి జన్‌మన్‌లో మరిన్ని పథకాలు అందించనున్నట్లు ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. రామనర్సాపురంలో ఉచితంగా కరెంటు మీటర్లు అందిస్తున్న కార్యక్రమాన్ని మంగళవారం పీవో పరిశీలించారు. ప్రతి ఇంటికి తిరిగి మీటర్ల ఏర్పాటును పరిశీలించారు. అనంతరం కొండరెడ్లతో మాట్లాడారు. కొండరెడ్లు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీవో వెంట విద్యుత్‌శాఖ ఈఈ, డీఈ, సిబ్బంది ఉన్నారు.

ఏకాగ్రత, పట్టుదలతో పరీక్షల్లో మంచి ఫలితాలు


కలెక్టర్ సతీమణి మానసకు సత్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9: ఏకాగ్రత, పట్టుదల, కష్టపడే మనస్తత్వమే యూపీఎస్సీ పరీక్షలో విజయానికి గీటురాయి అని అసిస్టెంట్ కలెక్టర్ టి.శ్రీపూజ అన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు మంగళవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ ప్రోగ్రాంలో ఆమెతోపాటు, కలెక్టర్ సతీమణి మానస పలు సూచనలు ఇచ్చారు. శ్రీపూజ మాట్లాడుతూ ఇంటర్‌లో మంచి ఫలితాలను సాధించిన తర్వాత ఆత్మస్థైర్యంతో కెరీర్‌ను ఎంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. మానస మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొనే మెళకువలు వివరించారు. విజయవాడ ఆంధ్రా లయోల కళాశాల ఫిజిక్స్ హెచ్‌వోడీ భాస్కరన్ మాట్లాడుతూ విద్యార్థి తనకు నచ్చిన రంగంలోనే ప్రథమస్థానంలో నిలిచేందుకు శ్రమించాలన్నారు. డాక్టర్ మానసను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. పెదవేగి ఆయిల్‌పామ్ పరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త ఎంవీ.ప్రసాద్, ప్రిన్సిపాల్ మెర్సీ పీఎం.సెలీన్‌రోజ్, ఆర్.మాధవి, ఇందిర, జ్యోతికుమారి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 9: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహించిన, ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.స్లీవజోజి హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను కుటుంబాలతో కలసి సంతోషంగా జరుపుకోవాలన్నారు. కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలతో కేసులలో ఇరుక్కోవద్దని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో జాయింట్ యాక్షన్ టీములను నియమించారు. మున్సిపల్ కమిషనర్ పి భవానీ ప్రసాద్, ఎంపీడీవో కేవీ.ప్రసాద్, ఎస్సై మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మండలంలో ఈనెల 18 వరకు 144 సెక్షన్ అమలులో ఉందని, కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు పి.సతీశ్ హెచ్చరించారు. మండల కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించి పంచాయతీ, సచివాలయ ఉద్యోగులకు తగు సూచనలు చేశారు. ఎంపీడీవో తిరుపతిరావు, డిప్యూటీ తహసీల్దారు దుర్గా మహాలక్ష్మి, ఈవోపీఆర్డీ సుబ్బరాయన్, పీసీ దుర్గారావు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

ఏలూరు క్రైం, జనవరి 9: దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని జిల్లా యువజన అధికారి దూలం కిశోర్ అన్నారు. నెహ్రూ కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు కోటదిబ్బ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు మై భారత్ వికసిత భారత్ - 2047 అంశంపై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కిశోర్ మాట్లాడుతూ యువత కృషితోనే రేపటి దేశ భవిష్యత్, ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. పోటీలలో గుర్రాల దీపిక ప్రథమ, విశాల్ కుమార్ ద్వితీయ, ప్రజ్ఞ అంబేడ్కర్ తృతీయ స్థానంలో నిలిచారు. వారికి ప్రిన్సిపాల్ గిరిబాబు బహుమతులను అందించారు. న్యాయనిర్ణేతలుగా ఎం.రాంబాబు, జి.వెంకటరావు, పరమేశ్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

యువజన దినోత్సవ పోటీలు

ఏలూరు రూరల్, జనవరి 9: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సాహిత్య మండలి, శ్రీరామకృష్ణసేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12, 13 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తుల్లాబొట్ల పురుషోత్తమరావు మంగళవారం తెలిపారు. 12న మహిళలకు ముగ్గుల పోటీ, విద్యార్థులకు వివేకానంద జయంతి సందర్భంగా వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న సంగీత వాయిద్య సమ్మేళనం, సంక్రాంతి వైభవం, ప్రవచనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఏలూరు పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థుల ప్రదర్శన

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9: నగరంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో సందడి చేశారు. స్కూలు ప్రాంగణాల్లో రంగవల్లులు, భోగిమంటలు, గాలిపటాలతో వేడుక చేశారు. సంతోషినగర్ శ్రీశర్వాణి హైస్కూలులో మంగళవారం రంగవల్లులు, భోగిమంటలు, గొబ్బెమ్మలు, బొమ్మలకొలువు, హరిదాసు, గోదాదేవి వేషధారణ, డూడూ బసవన్నల సందడితో గ్రామీణ పండుగ వాతావరణాన్ని తలపింపజేసింది. హెచ్‌ఎం సత్యశారద, డైరెక్టర్ మదనమోహనరాజు పాల్గొన్నారు. తంగెళ్ళమూడి శ్రీసూర్య హైస్కూలులో బాలికలకు సంప్రదాయ వస్త్రధారణ, స్కిప్పింగ్, రంగోలి, బాలురకు స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్లు డి.శ్రీనివాస్, ఎన్.స్వాతి కిషోర్, డైరెక్టర్ కె.చంద్రశేఖరరావు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు. ఇంద్రికగూడెం ఎంపీయూపీ స్కూలులో డీఈవో పి.శ్యాం సుందర్, ఎంఈవో రంగయ్య పండుగ ప్రాధాన్యత వివరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు ప్రసాద్, తిరుమలరావు, నిర్మలకుమారి, ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టు కార్యాలయ సెక్టోరల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: స్థానికంగా పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మేధా పాఠశాలలో భోగిమంటలు, భోగిపండ్లు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సిద్ధార్థ పాఠశాల, వీఎస్ఎన్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం పాఠశాలలో మహిళలు, విద్యార్థుల సందడి


జంగారెడ్డిగూడెంలో భిక్షాటనతో కార్మికుల నిరసన


చింతలపూడిలో మున్సిపల్ కార్మికుల భిక్షాటన



ఏలూరు నగర పాలక సంస్థ వద్ద భిక్షాటన


నినాదాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మునిసిపల్ కార్మికుల

భిక్షాటన

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఏలూరు టూటౌన్, జనవరి 9: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ నాయకులు కన్నబాబు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె కొనసాగించారు. ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి నిరసనగా కార్మికులు నగరంలో భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ పనితీరుకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో పంగనామాలు పెట్టుకుని సమ్మెలో పాల్గొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా జగన్ కార్మికులకు పంగనామాలు పెట్టారని యూనియన్ నాయకులు ఎల్.కృష్ణారావు, ఏ.జాన్‌బాబు విమర్శించారు. 15రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికి జగన్ స్పందించకుండా మొండి వైఖరితో వ్యవహరిస్తున్నారని కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● చింతలపూడి: మునిసిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చింతలపూడిలో మంగళవారం భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తొర్లపాటి బాబు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. మునిసిపల్ కార్మికుల నాయకులు అనురాధ, వెంకటయ్య, మార్తమ్మ, సర్వేశ్వరరావు, కృష్ణ, మరియదాసు, పలువురు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మున్సిపల్ కార్మికులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.వి.ఫ్లెన్షి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్ద నుంచి కార్మికులు భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జేవీ.రమణరాజు, కొత్తూరి నాగేశ్వరరావు, బొక్కా శ్రీను, రేలంగి నాగరాజు, దొండపాటి వెంకాయమ్మ, పొడుదోలు రమణ ఇంగుర్తి నాగరాజు, దోసూరి సంకురయ్య, పితాని సురేష్, చాపల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

21వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

ఏలూరు కలెక్టరేట్: సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న సమ్మె మంగళవారం 21వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా ఉదయం ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు భగవాన్ తదితరులు మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు అందరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత, పార్ట్‌టైమ్ అనే పదాన్ని తొలగించి ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా మార్చుచేయాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌గ్రేషియా రూ.20లక్షలు బెనిఫిట్‌ను ఇవ్వాలని, పదవీవిరమణ వయస్సు 62సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. విధుల్లో చేరాలని నోటీసులు ఇస్తే తాము బెదిరేది లేదని హెచ్చరించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.


ఏలూరులో అంగన్వాడీలతో కలసి రోడ్డుపై భోజనం చేస్తున్న నేతలు


లింగపాలెంలో అంగన్వాడీల రాస్తారోకో


ఉంగుటూరులో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


అంగన్వాడీల ఆందోళనకు సంఘీభావం తెలిపిన నేతలు

అంగన్వాడీల పోరు

లింగపాలెం, జనవరి 9: అంగన్‌వాడీల సమ్మె 29వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కరించాలని కోరితే ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గం అని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల సత్తా చూపుతామన్నారు. గంటకుపైగా రాస్తారోకో నిర్వహించడంతో కిలోమీటరు పైగా వాహనాలు నిలిచిపోయాయి. గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, కనీస వేతనం మాత్రమే కోరుతున్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను మరచి మాట తప్పి మడమ తిప్పాడని ఎద్దేవా చేశారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. బీజేఎస్. కుమారి, ఈశ్వరి, మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● పోలవరం: సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి డిమాండ్ చేశారు. అంగన్వాడీలు పద్మ, సరస్వతి, హైమవతి, కుబ్రా, జుబేద, వెంకటరమణ, సత్యవతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: అంగన్వాడీల సమ్మెకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న అంగన్వాడీలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

యూటీఎఫ్ నాయకుల నిర్బంధంపై నిరసన

ఏలూరు ఎడ్యుకేషన్: విజయవాడలో యూటీఎఫ్ 36 గంటల ధర్నాలో పాల్గొనకుండా ఉపాధ్యాయులు, నేతలను పోలీసులు నిర్బంధించారు. ప్రభుత్వ చర్యలను యూటీఎఫ్ జిల్లా నాయకులు ఖండించారు. జిల్లాలో పలు చోట్ల పోలీసులు సోమవారం రాత్రి నుంచే గృహనిర్బంధంలో ఉంచడమే కాకుండా మంగళ వారం ఉదయమే పోలీస్ స్టేషన్లకు తరలించడం అన్యాయమని సంఘ నగరశాఖ నాయకుడు రాజారావు విమర్శించారు.

● ఉంగుటూరు: యూటీఎఫ్ మండల నాయకులు ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు, సీహెచ్.శ్రీధర్, శివయ్య, వర్మను పోలీసులు నిర్బంధించారు. పలువురు ఉపాధ్యాయులు ఖండించారు.


ఏలూరులో జయహో బీసీ సభలో టీడీపీ నేతల అభివాదం


ఉంగుటూరులో గన్ని, గోరుముచ్చు గోపాల్ యాదవ్ తదితరులు

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం

ఏలూరు టూటౌన్, జనవరి 9: జగన్ అసమర్థపాలనలో రాష్ట్రంలో బీసీలు ఎక్కువగా నష్టపోయారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. చేపలతూము సెంటర్‌లో టీడీపీ జయహో బీసీ సభ మంగళవారం నిర్వహించారు. చంటి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం ద్వారా బీసీలకు పెద్దఎత్తున లబ్ధి చేకూరుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.75 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి బీసీలకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించి జగన్ బీసీలకు ద్రోహం చేశాడన్నారు. బీసీకి చెందిన 30 పథకాలకు పైగా వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. మాజీ ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ టీడీపీ అంటేనే బీసీల పార్టీ అన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదని, కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లకు కుర్చీ కూడా లేకుండా బీసీలను అవమాన పరిచారన్నారు. బీసీలంతా జగన్‌పై తిరగబడే రోజులు వచ్చాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా టీడీపీ వైపే వస్తున్నారన్నారు. మాజీ మంత్రి మారడాని రంగారావు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో బీసీలను ఆర్థికంగా బలహీన పరచడమే కాకుండా బీసీలపై భౌతిక దాడులకు పాల్పడిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గోరుముచ్చు గోపాల్‌యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ చక్రవర్తి, పట్నాల వెంకటేష్‌బాబు, వెంకటేశ్వరరావు, ఉప్పాల జగదీష్‌బాబు, దాసరి ఆంజనేయులు, దాసరి శేషు, తదతరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: తెలుగుదేశం ఎప్పటికి బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని గోరుముచ్చు గోపాల యాదవ్ అన్నారు. ఉంగుటూరులో మంగళవారం జరిగిన జయహో బీసీ సమావేశానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. మండల అధ్యక్షుడు శివబత్తిన కొండబాబు, పట్నాల వెంకటేశ్, కృష్ణమోహన్, నల్లా ఆనంద్, కరణం పెద్దిరాజు, బొమ్మిడి అప్పారావు, షేక్ మీరా, వంగపండు సత్యనారాయణ, నరమామిడి నాగేశ్వరరావు, గురువెల్లి రాజారావు, రాంధే రాజారావు, మన్నె పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆడమిల్లిలో సదస్సు

కామవరపుకోట: ఆడమిల్లిలో బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్టు టీడీపీ బీసీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జిజ్జూరి బాబ్జీ తెలిపారు. బీసీలు ఇంటింటికి వెళ్ళి టీడీపీ, జనసేన కూటమికి మద్దతుగా ప్రచారం చేయాలనే కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు సదస్సును ఏర్పాటు చేశామని చెప్పారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లోని బీసీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని, సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


చక్రాయగూడెంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో చింతమనేని

జగన్ సీఎం కావడం దురదృష్టం : చింతమనేని

పెదవేగి, జనవరి 9: జగన్ ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చక్రాయగూడెంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరించారు. పాలనపై అవగాహనలేని జగన్ సీఎం కావడంతోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని చెప్పారు. అవినీతి, అక్రమాలతో వైసీపీ పాలన సాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ప్రజలు ఇంటికి పంపించడం ఖాయమన్నారు. రాష్ట్రాన్ని చంద్రబాబు మాత్రమే తిరిగి గాడిన పెట్టగలరని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ప్రభాకర్ కోరారు. బొప్పన సుధాకర్, మాదు రవి కుమార్, కొనకళ్ళ శివమణి, దొర్రాజు శ్రీనివాసరాజు, కొనకళ్ళ కృష్ణ, తాతా సత్యనారాయణ, ఆకుల కృష్ణ, బడుగు నాని, చేకూరి భగవాన్ పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి


పథకాలను వివరిస్తున్న నాయకులు

లింగపాలెం: వేములపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతి రావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పనులను ప్రజలకు వివరించా రు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో నత్తా నాగేంద్రబాబు, పాతూరి ప్రభాకర్‌రావు, పాతూరి మురళీ, బలుసు శ్రీను, పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతుకు ఆర్థిక సాయం

ద్వారకాతిరుమల, జనవరి 9: గుండుగొలనుకుంటలో పాడి రైతు ఉజ్జు గంగరాజు పొలంలో మూడు పాడిగేదెలు, ఒక ఆవు, పెయ్యిదూడ హఠాత్తుగా మృతి చెందాయి. ఉపాధి కోల్పోయిన పాడిరైతు కుటుంబాన్ని ఆయన మంగళవారం వైసీపీ నేత బొండాడ వెంకన్నబాబు పరామర్శించారు. రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. జంగా కృష్ణారెడ్డి, గోపా నాగేశ్వరరావు, గుర్రాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు, ప్రతిపక్ష నేతలు

ల్యాండ్ టైటలింగ్ రద్దు కోరుతూ న్యాయవాదుల ర్యాలీ

చింతలపూడి, జనవరి 9: ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు చేయాలని కోరుతూ చింతలపూడి న్యాయవాదులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ సాగింది. ర్యాలీలో తెలుగుదేశం నాయకులు జె.ముత్తారెడ్డి, సొంగా రోషన్‌కుమార్, మాటూరి వెంకట్రామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, కోండ్రు దేవ, జనసేన నేత మేకా ఈశ్వరయ్య, చీదరాల మధుబాబు, సీపీఐ, సీపీఎం నాయకులు న్యాయవాదులకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. తహసీల్దార్ కృష్ణజ్యోతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల మాణిక్యాలరావు వినతిపత్రం ఇచ్చారు. ఈ చట్టంతో ప్రజలకు నష్టం జరుగుతుందని, రద్దు చేయాలని కోరారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఫిర్యాదు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 9: అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించినా కొన్ని ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని ఏపీ ప్రైవేటు విద్యాసంస్థల లెక్చరర్లు, టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.అంబేడ్కర్ మంగళవారం డీఈవో శ్యాంసుందర్‌కు ఫిర్యాదుచేశారు. తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థల వివరాలను డీఈవోకు తెలియజేశామని సంఘ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ వివరించారు.

పింఛన్ దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి

ఏలూరు రూరల్, జనవరి 9: జిల్లాలో డప్పు, చెప్పులు కుట్టే కార్మికుల పింఛన్ దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంలో డిజిటల్ అసిస్టెంట్లు సహకరించాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ మంగళవారం డీఆర్వోను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికులు, లెదర్‌వర్క్ కార్మికులకు ప్రభుత్వం పింఛన్ అందించాలని చూస్తుంటే గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, సెక్రటరీలు దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం లేదన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

పెదవేగి, జనవరి 9: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అధికారులు ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు అన్నారు. రామశింగవరం, ముండూరు గ్రామాల్లో మంగళవారం వికసిత్ యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, ప్రజలకు తెలియడంలేదన్నారు. సర్పంచ్‌లు ఆడపా శ్రీను, రాచూరి దేవి, ఎంపీడీవో జీఆర్.మనోజ్, పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణిమ, సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, ఏపీవో హేమలత, బీజేపీ నాయకులు గుమ్మడి చైతన్య, రమేష్ పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణకు సహకరించాలి

టి.నరసాపురం, జనవరి 9: ప్రతి ఒక్కరూ ఫైలేరియా నివారణకు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జె.కల్పనారాణి కోరారు. గ్రామ సచివాలయం 2పరిధిలో మంగళవారం రక్తపూతలు సేకరించారు. పీహెచ్ఎన్ ఎ లలిత కుమారి, మావుళ్ళమ్మ వై.వెంకటలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

శ్రీవారికి వెన్నతో అలంకారం



ఏలూరు కార్పొరేషన్, జనవరి 9 : ఆర్ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి వెన్నతో అలంకరించారు. శ్రీవారి నిత్య కల్యాణ మహోత్సవం కిళాంబి వెంకట పవనకృష్ణమాచార్యులు బృందం శాస్త్రోక్తంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నెల 17 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్, ఈవో నాగం సన్యాసిరావు తెలిపారు.

అభయాంజనేయుడికి కేంద్ర మంత్రి పూజలు

పెదపాడు, జనవరి 9: ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గ మంత్రిత్వశాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖల కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ మంగళవారం అప్పనవీడులోని ప్రసిద్ధి అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. యశోనాయక్‌కు పలువురు బీజేపీ నాయకులు స్వాగతం తెలిపారు.

ఆలయం వద్ద దాతల సహకారంతో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయం హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు.


మద్ది క్షేత్రంలో భక్తుల రద్దీ

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 9: గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయం మంగళవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన నిర్వహించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు వివిధ సేవల రూపేణ రూ.84,413 సమకూరినట్లు కొండలరావు తెలిపారు.

సంక్షేమ పథకాలే బీజేపీ ప్రభుత్వ లక్ష్యం

లింగపాలెం, జనవరి 9: పేదలకు సంక్షేమ పథకాలు అందించడం బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని నేతలు అన్నారు. సింగగూడెం, కె.గోపవరం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర మంగళవారం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరోగ్యాన్ని చేరువలోకి తీసుకువచ్చిందని, ఇంకా పలు పథకాల ద్వారా ప్రజలకు అనేక మేలులు కలిగేలా ప్రజాసంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఎంపీడీవో ఆశీర్వాదం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, ఆర్ఎస్ఎస్ చక్రధరరావు, ఆంజాలీడిడ్లా, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పెదపాడు మాజీ సర్పంచ్ భార్య నేత్రదానం



పెదపాడు, జనవరి 9 : 2007-2012 సంవత్సరంలో పెదపాడు గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన కాకరాల రామకృష్ణ ప్రసాద్ (బుజ్జిబాబు) భార్య ప్రభావతి (59) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతురాలి కోరిక మేరకు ఆమె కళ్లను దానం చేయడంతో, విజయవాడ కామినేని ఆసుపత్రికి చెందిన కంటి వైద్యసిబ్బంది నేత్రాలను సేకరించారు. మాజీ సర్పంచ్ రామకృష్ణ ప్రసాద్‌ను పలువురు పరామర్శించి సానుభూతి తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** ధనుర్మాసోత్సవంలోని ఆఖరి మంగళవారం నేపథ్యంలో కోటదిబ్బ వద్ద గల గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలో ఆంజనేయస్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త చిందా రాజు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.
- **ఏలూరు రూరల్ :** వంగాయిగూడెం గుడ్‌సమరటిన్ క్యాన్సర్, మల్టీస్పెషల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కొత్తపేటలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు నితీష్, అక్బర్‌భాష వైద్యసేవలు అందించారు.
- **పెదపాడు :** ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణ పట్ల తగిన శ్రద్ధ వహించాలని ఏఎంసీ ఛైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని అప్పనవీడులో నిర్వహించారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బత్తుల ఏసురాజు, బుద్దె రామసీత, ఎంపీడీవో సబ్బితి నరసింహమూర్తి, ఎంఈవో-2 దేవినేని వెంకటరమణ, పాల్గొన్నారు.
- పెదపాడు మండలం కొక్కిరపాడు గ్రామ శివారు పంటపొలాల్లోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి రాగివైరును దొంగించినట్లు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్సై చల్లా కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.
- **పెదవేగి :** పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన హేమలత, రాణిలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.15వేల చెక్కులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందించారు. సర్పంచ్ మద్దాల వాణి, నాయకులు నాగయ్య, నిమ్మల సుబ్బారావు, పామర్తి వీరయ్య పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** మర్రిగూడెంలో జగనన్న సురక్ష ఫేస్-2 వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు ఫణీంద్ర బాబు, మరో ముగ్గురు వైద్యులు 310 మందికి వైద్య పరీక్షలు చేశారు.
- **ఉంగుటూరు :** మండలంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. కైకరం హైస్కూలు మైదానంలో ఖో-ఖో,ఉంగుటూరు హైస్కూలులో వాలీబాల్, బాదంపూడి హైస్కూలులో క్రికెట్, కబడ్డీ, నారాయణపురం జూనియర్ కళాశాలలో క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.
- **లింగపాలెం :** వేములపల్లి, ముడిచర్ల గ్రామాల్లో ఎస్ఐ సాయిస్వరూప్ ఆధ్వర్యంలో సారా స్థావరాలపై దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.



నూజివీడు సబ్ జైలు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఉమ

మార్చాల్సింది ఆలీబాబానే.. దొంగలని కాదు : దేవినేని

నూజివీడు, జనవరి 9: రాష్ట్రంలో మార్చాల్సింది దొంగల ముఠా నాయకుడైన ఆలీబాబానేనని దొంగలను కాదని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు దేవినేని ఉమా అన్నారు. నూజివీడు సబ్ జైల్లో ఉన్న తిరువూరు టీడీపీ నాయకులను పరామర్శించేందుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యేలను మారుస్తూ ప్రజావ్యతిరేకతను అధిగమించాలని సీఎం జగన్ చూస్తున్నారని వాస్తవంగా మార్చాల్సింది దొంగలను కాదని, ఆ దొంగల ముఠా నాయకుడైన ఆలీబాబాను అని అన్నారు. తండ్రి సీఎంగా ఉన్నప్పుడే ఈడీ లెక్కల ప్రకారం రూ. 43 వేల కోట్లను దోచుకున్నట్లుగా తేల్చి లెక్కలు లేని రూ. 43 వేల కోట్ల ఆస్తిని జప్తు చేశారన్నారు. ఇప్పుడు సీఎంగా దోచుకున్న సొమ్ము కక్కించాలంటే ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మద్య నిషేధం అన్న జగన్‌రెడ్డి పెట్టిన నూతన మద్యం బ్రాండ్‌లతో రాష్ట్రంలో ప్రజలు పిట్టల్లా రాలుతున్నారన్నారు. ప్రతిరోజూ సరాసరిన ముగ్గురు పిచ్చిబ్రాండ్‌లు తాగి చనిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ వర్కర్లు, ఆశాలు, ఉపాధ్యాయులు చివరికి ఆయన నియమించిన వలంటీర్లు కూడా జగన్‌రెడ్డిని ఛీ కొడుతున్న సందర్భాలు నేడు చూస్తున్నామన్నారు. దొంగ ఓట్లతో గట్టెక్కుదామని జగన్ చూస్తున్నాడని ప్రతి ఒక్కరూ ఓటు విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. 200 యూట్యూబ్ ఛానెళ్ల ద్వారా 100 రోజుల్లో తన అవినీతి డబ్బును వెదజల్లి దుష్ప్రచారం చేసి ఎలాగైనా రాబోయే ఎన్నికల్లో గెలవాలని జగన్‌రెడ్డి చూస్తున్నాడని, దీనిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ఎన్ని ఎత్తులు వేసినా జగన్‌కు పరాభావం తప్పదని, వచ్చేది టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వమేనన్నారు. తిరువూరు టీడీపీ ఇన్‌చార్జ్ సేవల దత్తు తదితరులు పాల్గొన్నారు.



వంటావార్పు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వంటా వార్పుతో మున్సిపల్ కార్మికుల నిరసన

నూజివీడు టౌన్, జనవరి 9: మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష 15వ రోజుకు చేరింది. మంగళవారం వంటావార్పు చేసి తమ నిరసన తెలిపారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానన్న సీఎం జగన్మోహన్‌రెడ్డి తన హామీని నెరవేర్చాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఇతర డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ అధ్యక్షకార్యదర్శులు ఎన్ఆర్ హనుమాన్లు, జి.రాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవింద్, రజనీ, ఉషారాణి, పద్మ, రాణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాలో తప్పులుంటే చెప్పండి

▸రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో సబ్ కలెక్టర్

నూజివీడు, జనవరి 9: ఓటర్ల జాబితాలో తప్పులుంటే తన దృష్టికి తేవాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడుతూ ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని, తప్పులు దొర్లితే తనదృష్టికి తేవాలన్నారు. ఈ సందర్భంగా నూజివీడు ప్రాంతానికి చెందిన అనేకమంది తెలంగాణాలో ఓటర్లుగా అక్కడ ఓట్లు వేశారని, రాజకీయ పక్షాల నాయకులు ఆయన దృష్టికి తేగా నూజివీడు నియోజకవర్గంలో ఎక్కడైనా ఒక్కచోట ఉన్న ఓటు మరోచోట ఉన్నట్లుగా ఉంటే తన పరిధిలో ఉంటుందని, తెలంగాణలో ఓటువేసిన అంశమై తెలంగాణ ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మునునూరు రాజా, జనసేన నాయకుడు ముత్యాల కామేష్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంపై పార్టీల జెండాల తొలగింపు

చాట్రాయి, జనవరి 9: మండలంలోని చీపురుగూడెం గ్రామ సచివాలయంపై కట్టిన జెండాలను మంగళవారం అధికారులు తొలగించారు. సదరు సచివాలయంపై వైసీపీ జెండా ఎగురుతుండటంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు సచివాలయ సిబ్బంది దృష్టికి తెచ్చినా పట్టించుకోకపోవటంతో టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు కట్టి నిరసన తెలిపిన విషయం విదితమే. ఎట్టకేలకు అధికారులు జెండాలు తొలగించటంతో సమస్య పరిష్కారమైంది.

దాతల సహకారం నిరుపయోగం

▸కిసాన్ భవన్‌ను వినియోగంలోకి తేవాలన్న జనసేన

నూజివీడు టౌన్, జనవరి 9: రైతులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో పాలడుగు వెంకట్రావు తన తల్లిదండ్రులు పాలడుగు లక్ష్మణ్, నాగరత్నం పేరిట ప్రభుత్వానికి అప్పగించిన కిసాన్‌భవన్ నేడు నిరుపయోగంగా మారిందని జనసేన నాయకుడు ముత్యాల కామేష్ అన్నారు. నూజివీడులో 100 రోజులు 100 సమస్యలపై జనసేన పోరాటం పేరుతో జనసేన నాయకులు పాలడుగు వెంకట్రావు కిసాన్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నూజివీడు రైతాంగానికి ఉపయోగపడే ఉద్దేశంతో మామిడిపరిశోధనా కేంద్రానికి విరాళంగా ఇస్తే ప్రస్తుతం అది నిరుపయోగంగా మారిందన్నారు. సదరు భవనాన్ని తక్షణం ఉపయోగంలోకి తీసుకువచ్చి రైతులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు ఎం.సునీల్, పార్టీ నూజివీడు మండల ఉపాధ్యక్షులు ఇంటూరి చంటి, నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు 'అట్లూరి' చేయూత



మునునూరు, జనవరి 9: గుళ్ళపూడిలో అగ్ని ప్రమాద బాధితులకు అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. ఎస్సీ కాలనీకి చెందిన యలమెల్లి వెంకటేశ్వరరావు, యలమెల్లి సుబ్బారావు గృహాలు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవ డంతో వారు నిరాశ్రయులయ్యారు. మంగళవారం అట్లూరి ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకటరవీంద్ర వారిని పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేలు నగదు, రూ.5 వేలు విలువగల నిత్యావసర సరుకు లు, వంట సామగ్రి, కొత్త బట్టలను అందజేశారు. అట్లూరి ట్రస్ట్ సేవలు అభినందనీయమని టీడీపీ గ్రామ అధ్యక్షుడు బుజ్జి కొనియాడారు. రాష్ట్ర తెలుగు యువత నాయకుడు గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

బతుకు భారమై..

▸కుటుంబాల్ని నెట్టుకొస్తున్న ఒంటరి మహిళలు

▸విధి వక్రించి భర్తలు అనంతలోకాలకు

▸పారిశుధ్య పనులే జీవనాధారం

▸ఆశలు అడియాశలు చేసిన జగన్

▸తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె బాట..

(నూజివీడు టౌన్)

వారు ఒంటరి మహిళలు.. విధి వక్రించి భర్తలు మరణించడంతో కుటుంబ పోషణ వారిపై పడింది. వారికి ఆసరా ఒక్క పారిశుధ్య పనిమాత్రమే. వచ్చే జీతం కాస్తా ఆ పని వల్ల సంక్రమించే వ్యాధులకే సరిపోతోంది. ఈ క్రమంలో గత ఎన్నికల్లో పాదయాత్రగా వచ్చిన జగన్‌రెడ్డి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీతో కుటుంబాన్ని ఏదోలా ఒడ్డుకు చేర్చవచ్చనే ఆశతో ఉన్న వీరు తిరిగి ఎన్నికలు వచ్చినా వారి ఆశలు నెరవేరకపోవడంతో సమ్మెబాట పట్టిన వారితో కలసి అడుగులు వేశారు. ఈ ఒంటరి మహిళల దుస్థితి వారి మాటల్లోనే.....

జీతం వైద్య ఖర్చులకు సరి : పులిపాక రాణి



గత కొన్నిసంవత్సరాలుగా తీవ్ర అనారోగ్య సమస్య వేధిస్తోంది. పారిశుధ్య పని చేయటం ద్వారా వచ్చే రూ.13వేలు జీతం, ఆ హాస్పిటల్ ఖర్చులకే సరిపోతుంది. మున్సిపాల్టీలో డ్రైవర్‌గా పనిచేసే భర్త గత 12సంవత్సరాల క్రితం మృతిచెందారు. దీంతో ఈపనే కుటుంబపోషణకు ఆధారం. ఫలితంగా వైద్యఖర్చులు, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు కష్టసాధ్యం అవుతోంది. జగనన్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానన్నారు. సమానపనికి సమానవేతనం, ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలని కోరుతున్నాం.

ఏ ఆధారం లేదు: కుప్పాల పద్మ



భర్త చనిపోయి 19 సంవత్సరాలు. ఏ ఆధారం లేదు. ఆదుకునే కుటుంబ సభ్యులు లేరు. ఇద్దరు పిల్లల చదువు. సొంతిల్లు లేకపోవడంతో ఇంటి అద్దె చెల్లించాలి. పెరిగిన నిత్యావసర ధరలతో చాలీచాలని జీతంతో ఏ నెలకానెల అప్పులు పెరిగిపోతున్నాయి. సమాన పనికి సమాన వేతనం ఇస్తే కుటుంబాన్ని అప్పుల పాలు కాకుండా పోషించుకోవచ్చు. పర్మినెంట్ అయితే బాగుంటుంది.

భారమైన జీవనం : కమ్ములూరి రజిని



పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబ పోషణ భారంగా ఉంటోంది. ఇద్దరు పిల్లలను కళాశాలకు పంపాలి. అద్దె ఇల్లు. జీతం ఎక్కడవేసిన గొంగళి అక్కడే. 13 ఏళ్ల క్రితం మున్సిపాల్టీలోనే ఫైలేరియా డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న నా భర్త గుండెపోటుతో మరణించాడు. 2014లో రోడ్డుప్రమాదంలో నాకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్య ఖర్చులకు వచ్చే జీతం సరిపోదు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగం పర్మినెంట్ చేస్తే కొంతలో కొంత ఆసరా అవుతుంది.





కైకలూరులో చెవిలో పువ్వు పెట్టుకొని.. చాట్రాయిలో మోకాళ్లపై కూర్చుని అంగన్వాడీల నిరసన

ఆగని అంగన్వాడీల దీక్షలు

▸చెవిలో పువ్వులతో.., మోకాళ్లపై కూర్చుని 29వ రోజు నిరసనలు

కైకలూరు, జనవరి 9: కైకలూరులో అంగన్వాడీ కార్యకర్తలు చెవిలో పువ్వులు పెట్టుకొని, 29వ రోజు దీక్షను తెలుపుతూ 29 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. మంగళవారం కైకలూరు తహసీల్దార్ కార్యలయం వద్ద దీక్షను నిర్వహించారు. శిబిరాన్ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మాడెం వీరవెంకట సత్యనారాయణ, వి పవన్‌కాంత్, చావల శంకరశాస్త్రీ, బందెల లక్ష్మణరావు, బి ఇందిర, శ్రావణి, తదితరులు సందర్శించి అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పి. సుజాత, ఎల్. మీనాకుమారి, విజిత, ఝాన్సీ రమణ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని నిరసన దీక్షా శిబిరం వద్ద మండలంలోని 70 అంగన్‌వాడీ కేంద్రాలు, 20 మినీ అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులు పాల్గొని తమ డిమాండ్లు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు సూరపనేని అరుణ కుమారి, సొంగా మణి, రిబ్ పా మాట్లాడుతూ బుధవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షల్లో పాల్గొంటామని తెలిపారు.

పోస్టు ద్వారా నోటీసులకు ఏర్పాట్లు?

ముదినేపల్లి, జనవరి 9: సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని ఆదేశిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులకు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపేందుకు ఐసీడీఎస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఈ నోటీసులను చేతికి ఇవ్వకుండా రిజిస్టర్ పోస్టు ద్వారా పంపాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 12లోగా నోటీసులు అందేవిధంగా ఐసీడీఎస్ కైకలూరు ప్రాజెక్టు పరిధిలోని ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులను వెంటనే విధుల్లో చేరాలని నోటీసులు ఇవ్వనున్నారు.

సత్తా చూపుతాం..

మునునూరు: హామీలను నెరవేర్చకుండా ఎస్మాను ప్రయోగించి తొలగించాలని చూస్తున్న ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో భవిష్యత్తులో చూపిస్తామని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి హెచ్చరించారు. మునునూరు సచివాలయం వద్ద నిరసన దీక్షలు మంగళవారానికి 29వ రోజుకు చేరాయి. ఎరుపురంగు దుస్తులు ధరించి, 29 అంకె ఆకృతిలో కూర్చుని నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు కె.విద్యావతి, మేరీ సులోచన, శ్యామల, దుర్గ, జామాయమ్మ, కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెకు దిగినా ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలగకపోవడాన్ని నిరసిస్తూ నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. సీఎం హామీలను మరిచి ప్రతిగా తమపై ఎస్మాను ప్రయోగించటం దారుణమన్నారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్ హనుమాన్లు, జి.రాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, వసుంధర, శిరీష, పద్మ, శ్యామల, ఝాన్సీ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ విధానాలు వీడాలి

చాట్రాయి: ప్రభుత్వం నియంతృత్వ విధానాలు విడనాడాలని చాట్రాయిలో అంగన్వాడీలు మంగళవారం 29 ఆకారంలో కూర్చుని, మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి జి రాజు అంగన్వాడీల ఆందోళనకు మద్దతు తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్మాతో అంగన్వాడీలను భయపెట్టి సమ్మెను విఫలం చేయాలని కుట్ర పన్నుతోందని, ఐక్య పోరాటంతో ఎదుర్కోవాలన్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, ప్రమీల, నిర్మలజ్యోతి అన్ని గ్రామాల అంగన్వాడీలు పాల్గొన్నారు.



కానుకొల్లులో బాబు ష్యూరిటీ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

మండవల్లి, జనవరి 9: రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కైకలూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు అన్నారు. కానుకొల్లులో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి రాష్ట్రాభివృద్ధికి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. టీడీపీ నాయకులు కొడాలి వినోద్, కైకలూరు జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి ముదినేపల్లి మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, పార్టీ మండవల్లి మండల నాయకులు పళ్లెం ఏడుకొండలు, గూడవల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ - జనసేన కూటమిని ఆదరించాలి

ముదినేపల్లి: టీడీపీ - జనసేన కూటమిని ఆదరించి రాష్ట్రంలో ప్రజా పాలన తీసుకురావాలని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు కోరారు. అల్లూరులో మంగళవారం టీడీపీ నాయకులు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో ప్రతులను అందజేశారు. పార్టీ నాయకులు నీలిపల్లి సన్యాసిరావు, పత్తి శివ, బొమ్మనబోయిన రత్నం, దాసరి శ్రీను, పంతగాని నాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్

రోడ్ల అభివృద్ధిలో వైసీపీ విఫలం : కామినేని

కలిదిండి, జనవరి 9 : రోడ్ల అభివృద్ధిలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం పెదలంకలో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ లంక గ్రామాల ప్రధాన రహదారులు గోతులు పడి అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. రైతులకు సాగునీటి కొరత తీర్చటానికి కొండంగి లాకుల వద్ద రూ.13 కోట్లతో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసిన ఘనత తనదేనన్నారు. సీఎం జగన్ నియంత పోకడలతో ఆక్వా పరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతమొందించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, నాయకులు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నున్న రమాదేవి, అంద్రాజు శ్రీనివాస్, తాడినాడ బాబు, భోగేశ్వరరావు, అక్కల బోసు, వీరాస్వామి, రెడ్డి చక్రవర్తి, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ విజయం సాధించాలని మాలధారుడి ఆకాంక్ష

ఆగిరిపల్లి, జనవరి 9: ఆగిరిపల్లి గ్రామస్థుడు మణిమాల అంకబాబు అనే యువకుడు అయ్యప్పమాల ధరించి దీక్ష పూర్తిచేసి శబరిమలై వెళ్లాడు. అక్కడ ఫ్లెక్సీ ప్రదర్శించి రాష్ట్రంలో టీడీపీ విజయం సాధించాలని ఆకాంక్షించాడు.





న్యాయవాదుల నిరసన

గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం

నూజివీడులో మాజీ మంత్రి దేవినేని మద్దతు

కైకలూరు, జనవరి 9: ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయాలని కైకలూరులో మంగళవారం న్యాయస్థానాల సముదాయం వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ర్యాలీగా గాంధీ విగ్రహానికి, తాలుకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించి నివాళులర్పించి జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కొత్తగా ప్రవేశ పెట్టిన భూహక్కు చట్టాలతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేద, బలహీనవర్గాల ప్రజలు భూమి హక్కులను కోల్పోయే ప్రమాదముందన్నారు. చీకటి జీవో 512ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి లక్ష్మణరావు, చావలి శంకర శాస్త్రి, ఎండీ రజీమున్నీ, కే రమాదేవి, జయమంగళ గంగా ఫణీంద్ర లక్ష్మి, సీనియర్ న్యాయవాదులు తెలగంశెట్టి శ్రీనివాసరావు, కందుల రమాపార్వతి, కె. కోటయ్య, పి. పవన్‌కాంత్, బి. ఇందిర, మోరు శ్రీనివాసరావు, గంగాధరరావు, శ్రావణి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఉమ సంఘీభావం

నూజివీడు టౌన్: ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేయాలని కోరుతూ నూజివీడు కోర్టుహాల్ వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు 15వ రోజుకు చేరుకున్నాయి. న్యాయవాదులు యామలపల్లి హరిబాబు, పలగాని రాంబాబు, ఇటికల జానకీరామ్, రామినేని రామకృష్ణ దీక్షలో పాల్గొన్నారు. దీక్షలకు మాజీమంత్రి దేవినేని ఉమ సంఘీభావం తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రజల ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోయిందని, ప్రజల ఆస్తి హక్కుల నిర్ధారణ ఒక అధికారికి కట్టబెట్టడం, రెండేళ్లలోపు దానిపై అభ్యంతరాలు లేకపోతే సదరు ఆస్తులు అధికారి నిర్దేశించిన వారికే సంక్రమింపజేయడం దారుణమన్నారు. తిరువూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సేవల దత్తు తదితరులు న్యాయవాదులకు సంఘీభావం తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సీనియర్ న్యాయవాదులు మన్నెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భయం లేదు.. అనుమతి ఉంది!

▸అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లో జోరుగా జూదం

ముదినేపల్లి రూరల్, జనవరి 9: అధికార పార్టీకి చెందిన నాయకుడు కనుసన్నల్లో గత రెండు రోజులుగా రాత్రి సమయాల్లో కోత ముక్క జోరుగా నడుస్తోంది. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ముందస్తుగానే 12 రోజులు పోలీసుల నుంచి అనుమతి పొందామని ఎలాంటి భయం లేదని జూదరులకు హామీ ఇవ్వడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కోతముక్కకు భారీగా తరలివస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుడు సొంతంగా కోసు నిర్వహిస్తూ బరిలో ఉండటం గమనార్హం. ముదినేపల్లి పరిసరాలైన అన్నవరం ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో వడాలి గ్రామంలోని పొలిమేరలో గత రెండురోజులుగా కోత ముక్క జోరుగా సాగుతోంది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ జూదం జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తిచూడటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అధికారపార్టీ నాయకుడు కావడంతోనే పోలీసులు తమకేమీ తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ



నూజివీడు, జనవరి 9: ఎవరైనా కోడిపందేలు, పేకాట, ఇతర జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు డీఎస్పీ ఇ. అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేలు, కోడికత్తుల తయారీ దారులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వారిపై నిరంతరం నిఘాను ఉంచామన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఎవరైనా జూదక్రీడలకు సహకరిస్తే వారి పై కూడా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 398 బైండోవర్ కేసులు నమోదు చేసి 441 మందిని ఆయా మండలాల తహసీల్దార్ల వద్ద హాజరు పరిచామన్నారు. ఇవేకాక 16 పేకాట కేసులు నమోదు చేసి 81 మందిని అదుపు లోకి తీసుకుని వారి నుంచి రూ. 68,720లు, రెండు మోటారు వాహనాలను స్వాధీ నం చేసుకు న్నామన్నారు. 30 కోడిపందేల నిర్వహణ కేసులు నమోదు చేసి నిందితుల నుంచి రూ.41,171లు, 14 కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నా మని తెలిపారు.

మండవల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని పేకాట, కోడిపందాలు, గుండాట, ఇతర జూద క్రీడలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని మండవల్లి ఎస్ఐ సీహెచ్ రామచంద్రరావు హెచ్చరించారు. పెరికేగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రముఖులు పెరుమాళ్ళ పెద్ద వెంకటేశ్వరరావు, పెరుమాళ్ళ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆటో కార్మికుల ధర్నా

కలిదిండి, జనవరి 9 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని మంగళవారం కలిదిండిలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ఆటోలతో ర్యాలీగా బయలుదేరి వెళ్లి తహసీల్దార్ దశిక వంశీకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేస్తే తమకు ఉపాధి కరువై తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆటో యూనియన్ నాయకులు జాకిర్ హుస్సేన్, సాల జయరాజు, సార మండదాసు, కట్టా రామాంజనేయులు, మహేష్, మన్నె ఏసుబాబు, కె.నాగబాబు, ఎస్‌కె.ఖాజ, ఖాసీం బాబు, సూరిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఫైలేరియాతో అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి, జనవరి 9: ఆగిరిపల్లిలో ఫైలేరియా నివారణ కోసం పీహెచ్‌సీ సిబ్బంది పర్యవేక్షణలో రక్తపూతలు సేకరించారు. నూజివీడు సబ్ డివిజన్ ఆఫీసర్ ఎం.యలమంద ఆధ్వర్యంలో మొత్తం 300 రక్త నమూనాలు సేకరించటానికి 11 బృందాలు పనిచేశాయని పీహెచ్‌సీ డాక్టర్ జగన్మోహన్‌రావు తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మునునూరు, జనవరి 9: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం గోపవరం సచివాలయం -1 పరిధిలో ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని పరిశీలించి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యశ్రీకార్డు పరిమితిని రూ.25లక్షలు పెంచిందన్నా రు. రోగులకు మందులు, లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో 603 మందికి వైద్యపరీక్షలు చేశారు. సర్పంచ్ వాణి, ఎంపీపీ దుర్గాభవాని వెంకట్రావు, జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

చాట్రాయి: పట్టణాల్లోని పెద్ద ఆసుపత్రుల నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు గ్రామాలకు వచ్చి అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని వైస్ ఎంపీపీ పి. సుబ్బారెడ్డి కోరారు. నరశింహారావుపాలెంలో మంగళవారం రెండో విడత జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు ఇ. శ్వేత (పీడియాట్రిక్), సుప్రియా చౌదరి (జనరల్ మెడిసిన్), పీహెచ్‌సీ వైద్యులు బి. దుర్గాప్రసాద్, ఎం. జ్యోతి 326 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రశాంతి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా

ముదినేపల్లి, జనవరి 9 : మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు బుధవారం నుంచి ముదినేపల్లి మండలంలోని గురజ హైస్కూల్ ఆవరణలో నిర్వహించను న్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో కబడ్డీ, 11, 12 తేదీల్లో ముదినేపల్లి హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలు, సంక్రాంతి సెలవుల అనంతరం 17 నుంచి 20 వరకు బొమ్మినంపాడు, సింగరాయపాలెంలో ఖో-ఖో, క్రికెట్ పోటీలు జరుగు తాయని ఎంపీడీవో పి.మల్లీశ్వరి తెలిపారు. 105 టీములు పోటీల్లో పాల్గొంటాయి.

హెల్మెట్ ధారణపై కౌన్సెలింగ్

ఆగిరిపల్లి, జనవరి 9: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆగిరిపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ నంబూరి చంటిబాబు తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ కూడలి వద్ద పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు.